కథ

# హిపోక్రసి

## విరూరు రుక్మిణి

''దుర్గా, తల్లీ దుర్గా, ఇట్రామ్మా'' వంటింట్లోంచే కేకేసింది సత్యవతమ్మ.

''ఇదుగో వస్తున్నానత్తయ్యగారూ, ఒక్క క్షణం'' అన్న జవాబూ వెంటనే వినవచ్చింది. కానీ పిల్ల మాత్రం పత్తా లేదు పది నిమిషాల వరకు. ఏం చేస్తోందో చూద్దామని హాలులోకి వచ్చింది సత్యమ్మ. అక్కడ తన ముద్దుల కొడుకు దినేష్ దుర్గతో ముచ్చట్లు పెట్టుకుని కూర్చున్నాడు. అంతే కాదు కదలనివ్వకుండా చేయి పట్టుకుని ఉన్నాడు. ఓహో, ఇది వీడి నిర్వాకమా అనుకుంటూ వచ్చిన దారినే చప్పుడు చేయకుండా వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఐదు నిమిషాల అనంతరం ''ఏంటత్తయ్యా పిలిచారు. కాస్త లేటయిపోయింది. ఆ పనేదో మీరే చేసేసుకోలేదు కదా'' నొచ్చుకుంటూ వచ్చింది దుర్గ.


''అంత అర్జెంటేమీ కాదులే, ఇదిగో దేవుడి నైవేద్యానికి పాయసం చేశాను. దాన్లోకి ఏలకుల పొడి కావాలి. ఏలకులేమో ఫ్రిజ్‌లో ఉన్నాయి. అందులో మిగుళ్లు, తగుళ్లు అన్నీ ఉన్నాయి కదా. ఆ మైల వస్తువులన్నీ ముట్టుకోవడం దేనికిలే. ఆ ఏలకులు కొంచెం తీసి పొడి చేస్తావేమోనని పిలిచాను.

''అదెంతపని ఒక్క నిమిషంలో చేసిస్తాను'' అంటూ చిటికెలో పొడి చేసి ఇచ్చింది.

''మీ అత్తాకోడళ్లిద్దరికీ వంటింట్లోనే సరిపోతోందే. ఈ దుర్గ రాక ముందు అన్నీ నీవే మానేజ్ చేసుకునేదానివి కదా, మరి ఇప్పుడేంటీ అన్నింటికీ దుర్గా, దుర్గా అని పిలుస్తుంటావు. ఈ నెలలోనే నీకు దుర్గ ఎంత అలవాటయిందోగదా'' అన్నాడు దినేష్.

''ఒరే పిచ్చి సన్యాసీ, నువ్వు మాత్రం నెలకిందటి వరకు అమ్మా ఇంకెంత సేపే ఇంకా వంట కాలేదా అంటూ వంటింటి చుట్టూ తిరిగే వాడివి. ఇప్పుడు దుర్గా, దుర్గా అంటూ క్షణం విడవకుండా దాని చుట్టూ తిరగడం లేదా'' అంటూ మనసులోనే నవ్వుకుంది.

''అదేంటండీ అట్లంటారు, ఇన్నాళ్లు ఎవరూ లేక, చేతనైనా కాకున్నా అన్నీ తనే చూసుకున్నారు. నేనొచ్చిన తరువాత కూడా అన్నీ తనే చూసుకోవాలా, నేనేమంత రాచకార్యాలు వెలగబెడుతున్నాను కనుక, ఇంత చిన్న పని చేయలేకపోవటానికి'' అంటూ మొట్టమొదటి సారి దుర్గ అన్ని మాటలు మాట్లాడింది ఆ నెలలో.



ఆనందపడడం అత్తగారి వంతూ, ఆశ్చర్యపడడం దినేష్ వంతూ అయింది.

ఇంత చక్కగా తమింట్లో ఇమిడిపోయిన దుర్గను చూసి ఎంతో సంతోషించారు సత్యవతమ్మ దంపతులు. ఒక పొల్లు మాటగానీ, చేతగానీ లేక ఎంతో చక్కగా ఆ ఇంట్లో అడ్జస్ట్ అయింది దుర్గ. అందుకు కారణం సత్యవేమ్మనడం అతిశయోక్తి కాదు. అత్తగారితో పడరాని పాట్లు పడింది సత్యమ్మ. అవడానికి మేనత్తే అయినా, పెళ్లైన రోజు నుంచి కాల్చుకు తినింది వాళ్లత్తగారు దుర్గమ్మ. కోడలు పేరు కూడా దుర్గ కావడంతో ఒక్కసారి వణికిపోయింది సత్యమ్మ. అదీకాకుండా ఈ పిల్ల తమ అత్తగారి తరపున దూరపు బంధువు కూడా.

దీంతో మరీ దిగులు పడిపోయింది. కానీ దినేష్‌కు చాలా నచ్చింది ఆ పిల్ల. కొడుకు సంతోషం ముందు తన భయాలు తీసికట్టనిపించాయి. తన అత్తగారు దుర్గమ్మ సార్థక నామధేయురాలైతే, కోడలు దుర్గ అమ్మవారి సౌమ్యతకు ప్రతీక.

దుర్గకు నెలతప్పిందన్న సంగతి, దినేష్‌ను కంపెనీ తరపున అమెరికాకు పంపుతున్నారన్న సంగతి ఒకేసారి తెలిశాయి. అదృష్టం వెతుక్కుంటూ వచ్చిందని ఆనందపడిపోయారు ఆ కుటుంబ సభ్యులు. దినేష్ అమెరికా వెళ్తూ ''నీవు కావాలంటే మీ అమ్మావాళ్లింటికి వెళ్లి ఉండు, నీ వీసా వచ్చేవరకు రెండు మూడు నెలలు పట్టవచ్చేమో'' అన్నాడు దుర్గతో.

''ఎందుకూ అక్కడికి వెళ్లడం. అక్కడ మా అన్నా, వదిన, పింకీ, బబ్లూ, మా చెల్లి సునంద అందరూ ఉన్నారు. మీరు వెళ్లిపోయి, నేనూ మా ఊరెళితే ఇక్కడ అత్తయ్య, మామయ్య మరీ బోర్ ఫీలయిపోతారు. వీసా వచ్చిన తరువాత ఒక వారం వెళ్తాను అక్కడకి''

''సరే నీ ఇష్టం, ఎలా కావాలంటే అలా చెయ్'' అంటూ తాను అమెరికా వెళ్లిపోయాడు దినేష్.

''ఎంతైనా ఆడపిల్లలకున్న విచక్షణ ఈ మొగ పిల్లలకుండదు. పరాయింటి నుంచి వచ్చిన పిల్లైనా ఎంత బాగా మనలను గురించి ఆలోచించిందో చూశారా'' అంటూ భర్తతో చెప్పి చెప్పి మురిసిపోయింది సత్యమ్మ. అనుకున్న ప్రకారం దుర్గ కూడా రెండు నెలల్లో అమెరికా వెళ్లిపోయింది.

మరీ నెలలు ఎక్కువతే విమానంలో ఎక్కనీయరట. మరి ఇక్కడ కాన్పయితే, పుట్టిన పిల్లకో, పిల్లవాడికో అమెరికా సిటిజన్‌షిప్ రాదు గదా. అయినా అదేమిటో, ఈ వెర్రి వ్యామోహం. తనకు మాత్రం ఎప్పుడూ అత్తయ్యా అన్న దుర్గ పిలుపే వినపడుతూ ఉంటుంది. అమ్మా, అమ్మా అంటూ వెంట దిరిగే కొడుకు మాట వినిపించడం తక్కువే. అయినా ఈ పిల్ల ఎంత బాగా కలిసిపోయిందో తమ కుటుంబంలో. ఎంత ఒక్కయేడాదే గదా ఈ అగ్రిమెంటు. తరువాత ఇండియా వచ్చేస్తారు.. అనుకుంటూ కాలం వెళ్లబుచ్చసాగింది.

కంపెనీ పని మీద వెళ్లిన దినేష్ అక్కడే మరేదో ఉద్యోగం చూసుకొన్నాడట. గ్రీన్‌కార్డు కోసం అర్జీ పెట్టుకున్నాడట. అందుకని తాము ఇప్పుడే అమెరికా విడిచి రాకూడదని అమ్మా నాన్నలనే అమెరికాకు పిలిపించుకున్నాడు. నాలుగు నెలలు ఎంతలో అయిపోయాయి. మనవడి ఆలనా పాలనలో టైమే తెలియలేదు. వాళ్లిక్కడే ఉంటే ఎంత బాగుండేదో కదా. బోర్లా పడితే బొబ్బట్లు, పారాడితే పాయసం, అడుగు లేస్తే అరిసెలు, ఇవన్నీ కాక అన్నప్రాసన, తలనీలాలు, భోగిపళ్లు, పుట్టినరోజులు, ఎన్ని కలలో. అన్నీ కల్లలే ఐపోయాయి. అయితేనేమిటి, అవన్నీ తన కలలు కానీ తన కన్నకొడుకు కలలు వేరు. వాడికి మొదటి నుంచీ అమెరికా వ్యామోహం ఎక్కువే. పైగా వాడి ముక్కుసూటి వ్యవహారానికి, ఆ నిక్కచ్చితనానికి, ఆ అమెరికాయే మేలేమో. ఇక్కడ ఏ పనైనా మామూలు ఇచ్చి చేయించుకోవలసి వస్తే వాడెంత బాధపడేవాడు. అటువంటి అవసరమే వస్తే ఈయనే ఎలాగోలాగ ఆ పని చేయించేవారు. వాడు మాత్రం ససేమిరా, ఆ జోలికి పోయేవాడు కాదు. ఇంతెందుకు, వాడి పెళ్లి విషయంలోనూ అంతే గదా. తమ బంధువుల అమ్మాయే, వీడికి అన్ని విధాలా తగిన పిల్లే, ఇస్తామని వస్తే నిర్మొహమాటంగా వద్దని చెప్పడమే కాకుండా, ఆ పిల్ల తండ్రి బాగా లంచాలు తినే పెద్దమనిషి కనుకనే ఈ సంబంధం తనకు నచ్చలేదని చెప్పేశాడు కూడా. ఆ మాట ఆ నోటా ఈ నోటా వాళ్లవరకూ చేరి ఇప్పుడు తమకు వాళ్లకు మాటలు కూడా లేకుండా పోయాయి. ఆ అమెరికాలోనైనా వీడు కుదురుగా ఉంటాడా అని ఒక్కొక్కసారి భయం వేసేది సత్యమ్మకు. నీ మటుకు నీవు నిజాయితీగా ఉండరా, లోకమంతా నీ దోవనే నడవలాంటే అది జరిగే పనేనా అని తనెన్నిసార్లు నచ్చజెప్ప ప్రయత్నం చేయలేదూ.


''ఏంటమ్మా నువ్వు అట్లా మాట్లాడతావు. మన దేశం ఎటువంటిది. మన పూర్వీకులు ఎటువంటివారు, ఎంత నిజాయితీగా ఉండేవారు. మొన్న మొన్నటి గాంధీగారు, నెహ్రూగారు ఎంత నిజాయితీగా ఉండలేదు, ఎన్ని త్యాగాలు చెయ్యలేదు. ఏం మనమెందుకు ఇంత పెడదోవ పడుతున్నాము'' అంటూ తనకెన్ని లెక్చర్లు ఇవ్వలేదు. అమెరికా అంటే అందరూ అనుకునే భూతల

## బాబోయ్ ఆయేషా!

బాలీవుడ్‌లో 'కిస్సింగ్ హీరో' ఎవరయ్యా అంటే ఇమ్రాన్ హష్మి అని ఠక్కున చెప్తారెవరైనా! అలాగే హీరోయిన్‌లలో అలాంటి పాపులారిటీ గానీ తెచ్చుకోవాలనుకుంటోందో ఏమో ఆయేషా టకియా! ముద్దు సీన్లు ఉన్న సినిమాల్లో నటించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదనడమే కాదు, ఒకే సినిమాలో అలాంటివి ఎన్ని సీన్లున్నా చేసేస్తానంటోంది. 'మై అవుర్ మిసెస్ ఖన్నా' సినిమాలో సల్మాన్‌ఖాన్‌ని ఎంచక్కా ముద్దు పెట్టుకున్న ఆయేషా తీరు బాలీవుడ్ జనాలు విస్తుపోతున్నారట. పబ్లిసిటీ కోసం ఏవైనా చేయడానికి రెడీ అంటే ఇదే కాబోలు!



స్వర్గం కాకపోయినా మనిషి నిజాయితీగా తన బతుకు తను బతకవచ్చు. వీడి స్వభావానికి అక్కడ బాగానే ఉంటుంది. అనుకోకుండా వచ్చిన అవకాశం ఇది. తన స్వార్థం చూసుకొని వాడిని వెనక్కు రమ్మనడం న్యాయమేనా. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ తల్లిదండ్రులు వాడికి అసెట్సుగానే కనబడాలి గానీ అవరోధాలుగా కనబడకూడదు. ఏమైనా సరే, వాడిష్టానికి వాడిని వదిలెయ్యాలి అంటూ తనకు తనే ఎన్నోసార్లు నచ్చచెప్పుకుంది.




వారం వారం దినేష్ ఫోను రాగానే ''ఎంతవరకు వచ్చిందిరా నీ పచ్చకార్డు పని. ఎవరినైనా అడగలేకపోయావా కొంచెం తొందరగా పనవుతుందేమో. నిన్ను చూసి చాలా రోజులైపోయింది'' అంటే

''ఇక్కడ ఒకరిని అడిగే ప్రసక్తే లేదమ్మా. మన టర్న్ వస్తే మన పనైపోతుంది. అంతా చాలా పద్ధతిగా జరిగిపోతుంది. అయినా ఎప్పుడు చూడాలనిపిస్తే అపుడు వచ్చెయ్యండి. మీకిద్దరికీ పది సంవత్సరాల వీసా ఉంది గదా'' అంటాడు.

అయినా అదేం పక్క ఊరా, కనీసపక్షం లక్ష రూపాయలైనా లేకపోతే పోయిరావడం కుదరదు గదా. ఇంక అక్కడ బయటికి కదలాలన్నా వాళ్లిద్దరిలో ఎవరో ఒకరు తీసుకుపోవలసిందే. తనకు మొక్కజొన్న కంకులంటే ఎంతిష్టం. అక్కడ అవి ఎంతో బాగుంటాయి గూడా. కానీ ఏం లాభం, ఏం కావాలన్నా సిగ్గు చంపుకుని వాళ్లను అడగవలసిందే. తమంతట తాము ఒక్క చిన్న పని చేసుకోలేరు కదా. అంత పరాధీనం బతుకు ఏం బతుకు. తన మనవడు అమెరికా పౌరుడట. అదేదో మకుటం లేని మహారాజు అన్నట్టు మాట్లాడతారు అందరూ. ఏం, మన దేశానికేమైంది. ఎప్పటికైనా మన పౌరసత్వం అంటే జనాలు అటువంటి మక్కువ చూపించే రోజు వస్తుందా. తమ జీవితకాలంలో అది జరగనిపనే కావచ్చు కానీ భవిష్యత్తు మాట ఏం చెప్పగలం. ఒకప్పుడు యూరప్‌లో నేరం చేసినవారికి శిక్షగా ఈ అమెరికాకు పంపించేవారట గదా మనం మన నేరస్థులను అండమాన్‌కు పంపించినట్లు. మరి ఆ దేశం ఇప్పుడంతగా వెలిగిపోవడం లేదూ. నవ్విన నాపచేనే పండుతుందని ఊరకనే అన్నారు. ఏనాటికైనా మన భారతదేశానికి ఆ వైభవం వచ్చి తీరుతుంది.. ఈ అమెరికా నుంచి ఫోను రావడం తడవు తన ఆలోచనలిలా తీరూ తెన్నూ లేకుండా పరిగెడుతుంటాయి అనుకుంటూ మళ్లీ తన పనిలో మునిగిపోయింది సత్యమ్మ.

గ్రీన్‌కార్డు రావడమే తరువాయి దినేష్, దుర్గ, ధవళ్ ఇండియాకు వచ్చారు. మనవడు ఇంట్లో తిరుగాడుతూంటే సత్యవతమ్మ ఆనందానికి అవధులు లేవు. మనవడిని చంకలో వేసుకొని ''ఇదుగో ఇదే మీ నాన్న మంచం, ఇందులో తప్ప వాడు ఇంకెక్కడా పడుకునేవాడు కాదు, ఇదుగో మా నాన్న ఇచ్చిన ఈ వెండి గిన్నెలోనే వాడు మొదటి ముద్ద తినింది'' అంటూ వరసపెట్టి అన్నీ చూపించేది. అసలు మాటలే సరిగా రావు. ఆ వచ్చిన నాలుగు ముక్కలు ఇంగ్లీషువే. అయినా నానమ్మ మాటలకు అర్థం తెలిసిన వాడి మాదిరి ఆమె మాటలు వింటూ ఆమెను ఒక్క క్షణం విడిచిపెట్టే వాడు కాదు ధవళ్. ఉండే మూడు వారాల్లో ఊరూరు తిప్పితే మనవడి ఆరోగ్యం చెడిపోతుందని అందరినీ తమ ఇంటికే పిలిపించింది. అందరి తరపు బంధువులతో ఆ ఇల్లు ఒక సత్రం అయిపోయింది ఒక రెండు వారాలు. అందరి చేతుల్లోనూ అమెరికా మనవడే. పేరుకు తగ్గట్టు తెల్లగా బొద్దుగా ఉన్నాడేమో వాడంటే అందరికీ ముద్దే. అందరి చేతుల్లో మనవడ్ని చూసి ఆనందపడినా ఎక్కడ దృష్టి తగులుతుందోనని తెగ మదనపడిపోయేది. తనకు తెలిసినవన్నీ దిగదుడిచి పోసేది. అందరూ ఒక యెత్తు. సత్యవతమ్మ పెద్దక్క అరుంధతమ్మ ఒకెత్తు. ఇంటికి పెద్దదే కాకుండా నోటిధాటి కూడా పెద్దది కావడంతో ఆమెకు ఎవరూ ఎదురు చెప్పేవారు కాదు. వచ్చీ రాగానే

''యేమే సత్యవతీ, ఉన్న ఒక్క కొడుకును అంత దూరం పంపించేశావు. వాడక్కడే సెటిలయ్యాడట గదా. వద్దని చెప్పకపోయావా, ఎందుకంత అమెరికా పిచ్చి నీకు, నీకేం కూటికి తక్కువా, గుడ్డకు తక్కువా, మరిదిగారి ఆరోగ్యం అంతంతమాత్రమే కదా. సంపాదించింది చాలు గానీ వచ్చెయ్యమను వాణ్ని. నీవు చెప్పలేకపోతే నేనే చెప్తాను. నేను వాడికి పెద్దమ్మనేగా, ఆమాత్రం చెప్పే హక్కు నాకుందిలే''

''హక్కులు అధికారాల వరకు ఎందుకులే అక్కా, వాళ్ల ఇష్టం వాళ్లది. మన ఇష్టాయిష్టాలు చిన్నవాళ్ల మీద రుద్దడం దేనికి. వాళ్లకు తెలియనా సాధక

## గోపిక పెళ్లి?

**బొద్దుగా ముద్దుగా వుండే గోపిక తెలుగు, తమిళ, మలయాళ భాషా చిత్రాల్లో బిజీగా వుంది. ఈ కేరళ కుట్టి అతి త్వరలోనే పెళ్లి చేసుకుని జీవితంలో సెటిలయ్యే వుద్దేశంలో వుందని ఆమె సన్నిహితుల ఉవాచ. అమెరికాలో వుంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో ఆమె పెళ్లి జరగబోతోందనేది చెన్నయ్ సినీ వర్గాల్లో హాట్ న్యూస్. అయితే పెళ్లయిన వెంటనే సినిమాలకు గోపిక గుడ్‌బై చెప్పకపోవచ్చునని, సగం నిర్మాణంలో వున్న సినిమాలు, ప్రస్తుతం అంగీకరించిన సినిమాలు పూర్తయ్యేక గుడ్‌బై సంగతి ఆలోచించవచ్చని అంటున్నారు. సంతోషం.**



బాధకాలు. ఇంకా చెప్పించుకునే వయసు కాదు కదా వాడిది. ఒక బిడ్డ తండ్రి కూడా అయ్యాడు. వాడికి మనం చెప్పకూడదు, ఊరుకో''

''అయ్యో రామా, మరీ అంత గారాబం పనికిరాదే. రేపు మీకేమైనా కాగూడనిది ఐతే ఏం చేస్తారు. ఎవరు వస్తారు చెయ్యడానికి. ఎవరి సంసారాలు వారివి''

''ఏమైనా నిన్ను పిలువనులే గానీ ఊరుకో. మాకు మాత్రం కొడుకు కోడలు ఇంట్లో ఉండాలని, మనవడితో ఆడుకోవాలనీ లేదా యేం. ఎవరికెట్లా రాసి పెట్టుంటే అట్లా అవుతుంది''

''ఓహో, నీవు చెప్పినా వినలేదన్నమాట వాడు. బాగా మారిపోయాడే వాడు. నువ్వేం దిగులు పెట్టుకోకు. నా కొడుకు శీనయ్య ఉన్నాడు గదా, ఇంటి పట్టునే ఉంటాడు వాడు. నీకేమవసరం వచ్చినా కాకితో కబురంపితే చాలు వచ్చి వాలిపోతాడు. కడుపున పుట్టిన పిల్లలు కాదనుకుంటే మాత్రం, తోడబుట్టినవాళ్లం మనం అట్లా తోసిపారేసుకోలేం గదా'' దినేష్ అటువైపు రావడంతో అరుంధతమ్మ




మాటల తీరే మారిపోయింది. ''ఒరేయ్ దినేషూ, మీ అన్న, అదేరా బాబిగాడు, వాడూ అమెరికాకు పోవాలనుకుంటున్నాడురా. నిన్ను



ఏవేవో అడగాలట. ఎందుకురా, మనకు ఆ దిక్కుమాలిన దేశాలు అంటే వినడం లేదు. నేను అమెరికాకు పోయినా శీను ఉంటాడు గదా మిమ్మల్ని చూసుకోడానికి, పిన్నమ్మకు దినేష్ ఒక్కడే అయినా తను పంపించలేదా అంటూ ఒకటే దబాయింపు. నాకైతే ఇష్టమే లేదనుకో. మీ అమ్మ మాదిరిగానే, కానీ ఏం చేస్తాం, అది నోరు మూసుకుని ఊరుకోలేదూ, నేనూ అంతే. ఈ కాలం పిల్లల మాట పెద్దలు వినాలి గానీ పెద్దల మాట పిల్లలు వింటున్నారా యెక్కడైనా''

''ఏంటి పెద్దమ్మా, నేను అమెరికా వెళ్లటం తనకిష్టం లేదని అమ్మ చెప్పిందా, నాతో ఎప్పుడూ అననేలేదే''

''చెప్పిందా అంటే, వినేవాడుంటే చెపుతుంది. అయినా అన్నీ చెపితేనేగానీ అర్థంగావా యేమిటి, ఎంతైనా తోడబుట్టినదాన్ని ఆమాత్రం అర్థం చేసుకోలేనా దాని బాధను''

అదేమిటీ అమ్మ ఎప్పుడు తనకు సపోర్టుగానే మాట్లాడేది. నాన్నే ఒకటి రెండు సార్లు మనకెందుకురా ఆ లేనిపోని అమెరికాలు అవీ. హాయిగా ఇంటిపట్టున ఉద్యోగం చేసుకోక. నాకున్నది నీవొక్కడివి. ఉన్న పాతికో పరకో నీదే గదా. ఎందుకీ లేనిపోని తాపత్రయాలు అంటే అమ్మే నాన్నను చిన్నగా మందలించింది కూడా. మరి పెద్దమ్మ యేమిటీ ఇట్లా అంటూ ఉంది. ఈమాటే దుర్గతో అన్నాడు కూడా.

''అవునండీ, మీ అమ్మగారు యేం చెప్పారో నాకు తెలియదు కానీ పెద్దమ్మ నాతో కూడా అట్లాగే అన్నారు. అత్తయ్యగారు కూడా నిన్న పెద్దమ్మతో మాట్లాడుతూ కొంచెం మనసు కష్టపెట్టుకున్నట్లే మాట్లాడుతూ ఉంటే విన్నాను. అదే నాకు అర్థం కావడం లేదు. అత్తయ్య ఎప్పుడూ మనతో ఒక్క మాటైనా అనలేదు''

''ఏదైనా బాబును అమెరికాకు పిలిపించుకోవే కోడలా, మీ తోడికోడళ్లిద్దరు ఒకరికొకరు తోడుగానైనా ఉంటారు. ఆ దేశం కాని దేశంలో'' అంటూ బండెక్కింది అరుంధతమ్మ.

బంధువులందరూ వెళ్లిపోవడంతో ఇల్లు మళ్లీ యథాస్థితికి వచ్చింది. కానీ దుర్గ మాత్రం ఎందుకో ముభావంగా ఉందనిపించింది సత్యమ్మకు. ఊరికి పోయే రోజు దగ్గరికి వస్తున్నదని దిగులా, లేకపోతే అరుంధతి ఏమైనా అనిందా, దాని నోరు అంత మంచిది కాదు అనుకుంటూ ఆ రోజు వంటింట్లో తన పక్కనే కూరలు తరుగుతున్న దుర్గతో ''ఏంటమ్మా అదోలా ఉన్నావు. ఏం జరిగింది. నీలో నువ్వే ఏదో బాధపడుతున్నావు. అరుంధతి ఏమైనా అనిందా'' అన్నది.

లేదన్నట్లు తల ఊపింది దుర్గ.

''ఐతే మరేమిటి, నీ మనసులో ఏముందో చెప్పకపోతే నాకెట్లా తెలుస్తుంది. నేనేమనుకోనులే చెప్పు.''

''నిజంగా చెప్పమంటారా.''

''చెప్పు తల్లీ. మనసులో పెట్టుకొని మధనపడేకన్నా, చెపితే బరువు తీరి మనసు తేలికవుతుంది''

''నాకు హిపోక్రసీ అంటే అసలు నచ్చదు''

''ఇప్పుడా అరుంధతి మాటెందుకు గానీ నీ బాధేమిటో చెప్పు''

''పెద్దత్తయ్యగారి మాట కాదు నేనంటున్నది.

## బరువు పెరిగిన స్నేహ

వేసవిలో మన దేశంలో ఎండల్ని తట్టుకోవడం అంటే మామూలు సంగతి కాదు. అందుకనే అవకాశం వున్న వాళ్లు ముఖ్యంగా సినిమా తారలు చల్లని విదేశాలకు ఎంచక్కా టూర్లు వేసేస్తారు. స్నేహ కూడా ఇటీవల సమ్మర్‌లో పారిస్ వెళ్లిపోయిందిట. ఇక్కడ మండువేసవి అయితే అక్కడ గజగజలాడించే చలిలో స్వెట్టర్లు ధరించి ప్రకృతిని ఎంజాయ్ చేసిందిట. అంతేకాదు ఎక్కువగా పిజ్జాలు, బర్గర్‌లు భుజించిందిట. ఇండియాకొచ్చి చూసుకుంటే ఏముందీ, దాదాపు 3 కిలోల బరువు పెరిగిన సంగతి గ్రహించిందిట స్నేహ. ఇప్పుడామె ఆ బరువు తగ్గే ప్రయత్నాల్లో బిజీగా ఉంది.

మన మాటే''

''మనింట్లోనా, మనింట్లో ఎవరెట్లా ఉన్నారు. మీ మామగారేమైనా అన్నారా, అయినా ఆయన ఎవ రినీ ఏమీ అనే మనిషి కాదే. ఇంతమంది జనం చూసి గాభరా పడ్డారో ఏమో. అసలే వంటరితనం ఆశించే మనిషి. ఆయన మాటలేమీ పట్టించుకో కమ్మా, అయినా పిచ్చి పిల్లా, అమెరికా అంటే ఎంత దూరం. విమానం ఎక్కితే ఒక్కంటే ఒక్కరో జులో ఇక్కడుండొచ్చు. మన దేశంలోనే అస్సామ్ నుంచి రావాలన్నా అంతకన్నా ఎక్కువ టైమే పడు తుంది. అయినా ఇవన్నీ నీకు తెలియవా, ఊరకే అలా దిగులు పెట్టుకోకే''

''అది కాదత్తయ్యా, మీరేమో ఇప్పుడట్లా అంటున్నారుగానీ గ్రీన్‌కార్డు రాకముందు కూడా ఎప్పుడు ఫోను చేసినా యేరా, మీ పచ్చకార్డు కథే మిటీ అని ఆత్రంగా అడిగేవారు గదా. మరి నిన్న పెద్దత్తయ్యగారితో మాత్రం మేము మీ మాట వినడం లేదని, అందరికీ దూరంగా అమెరికాలో సెటిలైపోవాలని అనుకుంటున్నామని అన్నారు కదా. అది హిపోక్రసి కాకపోతే మరేమిటి. పెద్దవారు మీరలా మాట్లాడవచ్చా. నేనైతే మీరట్లా అంటారని కల్లో కూడా అనుకోలేదు. ఈ హిపోక్రసీయే నా బాధంతా''

''అయ్యో దుర్గా, అదా సంగతీ, ఆ కూరలు తరగడం కట్టిపెట్టి ఇలా రా, ఆ హాల్లో కూచొని మాట్లాడుకుందాం'' అంటూ తనూ గాస్పొయ్యి కట్టేసి దుర్గ చెయ్యి పట్టుకుని హాల్లోకి వచ్చింది.

''చూడు తల్లీ, మా అరుంధతి సంగతి నీకు తెలియదు. అయినా నాకుగా నేను మీరు నా మాటలు వినడం లేదని చెప్పానా. అది అన్న మాటలకు మాకు మాత్రం మా కొడుకు కోడలు ఇక్కడే ఉండాలని ఉండదా అన్నాను. అంతేకదా నేన న్నది అది కూడా ఎందుకన్నానో తెలుసా, అట్లా అనకపోతే అరుంధతి అందరితో మనిద్దరం పోట్లా డుకున్నామని అందుకనే నీవు దినేష్‌ను అంత దూరం తీసుకెళ్ళిపోయావని, అందుకనే నాకు ఇసు మంతైనా బాధ లేదని ప్రచారం చేస్తుంది. ఇప్పుడైనా అట్లా చెయ్యదని గారంటీ లేదనుకో. నీకు నా సంగతి తెలియదా, మీకెక్కడ మంచి భవిష్యత్తు ఉంటే నాకదే ఇష్టం. దినేష్ తెలివితేటలు నిజా యితీ ఈ దేశంలో రాణించవని నాకు తెలీదా. వాడి తెలివి తేటలకు తగిన గుర్తింపు రావాలనేదే నా తపన. అది అమెరికా అయినా అనంతపురమైనా నాకొకటే. నా బిడ్డ సుఖంగా సంతోషంగా ఉండాలి. అదే నేను కోరుకునేది. అదేమీ గొంతెమ్మ కోరిక కాదు కదా. కుటుంబ జీవితంలో నీ సహచర్యం దొరికింది. ఆ విషయంలో వాడి గురించి ఇంక నాకు దిగులే లేదు. ఇక ఉద్యోగ విషయంలోనూ వాడు బాగా రాణించి మెప్పు పొందాలనేదే నా కోరిక. కొడుకు సంతోషం కోరుకునేది తప్పయితే నేను చేసేది తప్పే. కానీ నీవు ఇంతకు ముందు హిపోక్రసి అన్నావే అదే నా బాధంతా. మన కుటుంబం నలుగురి నోళ్లలోనూ నానకూడదని, మా అరుంధతికి ఆ ఛాన్సు ఇవ్వకూడదనే అలా మాట్లాడాను. కొన్ని సందర్భాలలో ఈ రెండు నాలికల మాటలు తప్పవు. ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి అని మనవాళ్లు చెప్పనే చెప్పారు. దానిని హిపోక్రసి అని అంత పెద్ద మాట లతో కొట్టొద్దు తల్లీ. అది బిడ్డల కోసం తల్లి పడే ఆరాటమే అని అర్థం చేసుకో చాలు. ఇంతకన్నా నీకు నేనేమీ చెప్పలేను చెప్పను కూడా. నీవు తెలివిగల దానివి నీవే ఆలో చించుకో''

నిజంగా ఆలోచనలో పడింది దుర్గ. తన తల్లి కన్నా బాగా తనను అర్థం చేసు కుంది అత్తగారు. ఒక్కసారైనా తన మనసు నొప్పించి యెరుగరు. తను కాన్పుకు ఇండియాకు రాను అమెరికాకే రమ్మంటే తన తల్లి ఎంత రాద్ధాంతం చేసింది. ఏం ఆమాత్రం కాన్పు మేం చెయ్యలేమా. ఆ కాన్పు చేసే శక్తి కూడా మాకు లేదని అందరూ అనుకోవాలనేగా నీ ఉద్దేశం. ఇంగ్లీషు ముక్కయినా తెలియని నేను ఆ దేశాలకు ఏం వస్తాను అథవా వచ్చినా ఏం చేసి ఛస్తాను అంటూ నిష్ఠూరాలు పలికి రానే లేదు. మీరు రండ త్తయ్యా కాన్పు టైముకి అంటే ఏం, మీ అమ్మ ఎందుకు రావడం లేదు అని ఒక్క మాటైనా అడగ లేదు. ఎప్పుడు రావాలమ్మా మేము. రావాలంటే ఏమేం చేయాలి అంటూ వెంటనే ఒప్పేసుకు న్నారు. అమెరికాలో కూడా ఎంత చక్కగా అడ్జస్ట్ అయ్యారు. భాష తెలియదన్నమాటే కానీ అంద రితో ఎంత ఆప్యాయంగా మెలిగేవారు. తన స్నేహి తులంతా ఎంత అదృష్టవంతురాలివే ఇంత మంచి అత్తగారు దొరికారని తనను మెచ్చుకున్నారు. మరి తనేమిటీ ఇంత చిన్న విషయంలో అత్తగారిని అంత తప్పు అంచనా వేసింది. పెద్దత్తయ్యగారి సంగతి తెలి సిందే గదా. తాము అత్తయ్య మామయ్యలను వదలి అమెరికా వెళ్లామని నిష్ఠూరం వేస్తూనే తన కొడు కును అమెరికా పంపాలని ఆరాటపడుతున్నారు కదా. మరి ఆవిడ మాటలను పట్టుకొని అత్తయ్య గారిని అలా నిలదీయడం ఏం తెలివైన పని. తన కేదో అయింది అనుకుంటూ సిగ్గు పడుతూ ''ఉండండత్తయ్యా కాఫీ తెస్తాను ఇద్దరం కలిసి తాగుదాం'' అంటూ వంటింట్లోకి దారి తీసింది దుర్గ. కళ్లనీళ్లు అత్తయ్యగారికి కనపడకూడదని వడివడిగా అడుగులేసింది అదేమిటో వళ్లంతా తూలినట్లయి పడబోయింది దుర్గ.

''ఏమైందమ్మా'' అంటూ ఒక్క ఉదుటున వచ్చి పట్టుకుంది సత్యమ్మ.

''ఏంటో అత్తయ్యా, కళ్లు తిరిగినట్లయింది''

''ఎందుకూ...?'' అంటూ కోడలిని పరీక్షగా చూసి, విశేషమా అనడిగింది. అవును ఇండియా ప్రయాణం, బంధువుల రాక వీటన్నిటిలో తనంత ధ్యాసగా ఆలోచించలేదు గానీ అదే నిజ మేమో అనుకుంది దుర్గ.

'పాపం, వంట్లో నలతతోనే అట్లా పిచ్చిగా ఆలోచించింది దుర్గ' అనుకుంది సత్యమ్మ.

''నువ్ కూర్చో నేను కాఫీ కలుపు కొస్తాను'' అంటూ నుదుటి మీద చిన్న ముద్దు పెట్టుకున్న సత్యమ్మను చూసి ఈమెనా నేను హిపోక్రెట్ అన్నది అని బాధపడిపోయింది దుర్గ.

☆

## నో ఐటమ్ సాంగ్స్

**తెలుగులో కూడా హీరోయిన్‌గా నటించడానికి అంగీకరించిన మందిరా బేడీ ఐటమ్ సాంగ్‌లు మాత్రం చేయనంటోంది. 'మన్మథ'లో ఐటమ్ నంబర్ చేసిన మందిరా బేడీ తనకి ఇలాంటి ఆఫర్లు చాలా వస్తున్నాయని కానీ కేవలం ఐటమ్ గాళ్‌గా వుండద ల్చుకోలేదు. హీరోయిన్‌గా, అదీ సెలక్టివ్ పాత్రల్లోనే నటించాలనుకుంటున్నాను అంటోంది మందిర. తెలు గులో హీరోయిన్‌గా నటించడానికి ఆమె దాదాపు 30 లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు కూడా ఓ టాక్ వుంది. కానీ ఆమెకి ఇక్కడ అంత సీనుందా అని!**

